క్లుప్తంగా

క్రీడా కోటా పెంపు హర్షణీయం

విజయవాడస్పోర్ట్స్: క్రీడా కోటాను రెండు నుంచి మూడు శాతం పెంచి, ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా క్రీడాకారులకు నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా జీవో విడుదల చేసిన కూటమి ప్రభుత్వానికి పలు క్రీడా సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి క్రీడా కోటా పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. దక్షిణ భారత అథ్లెటిక్ క్రీడల మానటరింగ్ కమిటీ చైర్మన్ ఆకుల రాఘవేంద్రరావు, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, జూడో అసోసియేషన్ సీఈవో వెంకట్ నామిశెట్టి ఈ సమావేశంలో మాట్లాడారు. క్రీడా కోటాను పెంచాలని, ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా నేరుగా ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ 2024 అక్టోబర్ 9వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసినట్లు వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నేడు నగరంలో టాయ్ గ్రంథాలయం ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యాన ఏప్రిల్ 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు పిల్లల కోసం టాయ్ లైబ్రరీని ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ రావి శారద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీముఖి అనుమోలు ఈ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తారని, ఇందులో 12 ఏళ్లలోపు చిన్నారుల కోసం 25 రకాల ఇండోర్ గేమ్స్ ఉచితంగా టాయ్స్ రూపంలో ఉంచనున్నామన్నారు. డ్రాప్ గేమ్, స్టార్ గేమ్, కలర్ ఫుల్ గేమ్, గో ఫ్రాగ్గీ గో గేమ్, రైడ్ విత్ రామ, క్యాచ్ ఏ ఫిష్ తదితర గేమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. నగరంలో తొలిసారి వినూత్నంగా ప్రారంభించనున్న కార్యక్రమానికి తల్లిదండ్రులు పిల్లలను వెంటబెట్టుకొని రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ భూమి దినోత్సవం పోస్టర్ల ఆవిష్కరణ



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రపంచ భూమి దినోత్సవం సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పోస్టర్స్ తయారు చేసి మంగళవారం ఆవిష్కరించారు. మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏమి ఉండాలనే అంశంపై ఈ విద్యాసంవత్సరంలో భూమిని కాపాడుకోవడానికి ఒక సత్యం ఇవ్వడం జరిగిందని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ తెలియజేశారు. భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ముగిసిన సువార్త సభలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులో నజరేతు ప్రార్థనామందిరం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన యేసయ్య సువార్త సభలు మంగళవారం ఘనంగా ముగిశాయి. దైవజనులు కె.జాన్ మంగాచార్యులు, ఎం.ఏలీషా ఏసుక్రీస్తు సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా పాస్టర్ జీ ధర్మానాయక్ వాక్యోపదేశం చేశారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. శాంతి సహనం అలవర్చుకుని తోటివారికి చేతనైన సాయం చేయాలని అన్నారు. విశ్వాసకులు ఆలపించిన యేసయ్య భక్తిగీతాలు ఆహుతులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సాయంత్రం ప్రేమ విందు జరిగింది.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. విద్యార్థులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పీ లోకేశ్వరి పర్యవేక్షించారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం

- ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్
- నీటి పైపులు పగిలి రోడ్లపై నీటి ప్రవాహం
- పన్నుల చెల్లింపు వేళా సమస్యలపై స్పందించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పోస్ట్‌మ్యాన్ రామచంద్రరాజు వీధిలో ప్రమాదకరంగా మ్యాన్ హోల్



సైడ్ కాలువ నుంచి పడిపోయి ప్రమాదాలకు కారణమవుతున్న సిమెంట్ చప్టా రాయి



పైపులైన్ పగిలి లీకవుతున్న మురుగునీరు.. పగిలిన చోట రాళ్లు అడ్డుగా పెట్టిన దృశ్యం



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేని స్థితిలో అధికారులు ఉంటున్నారని పన్నులు కడుతున్న ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రమాద భరితంగా మ్యాన్‌హోల్స్..

స్థానిక 58వ డివిజన్ ఇందిరానాయక్‌నగర్‌లో మ్యాన్‌హోల్స్ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇక్కడి పోస్ట్‌మ్యాన్ రామచంద్రరాజు వీధిలో రోడ్డు మధ్యన ఉన్న మ్యాన్‌హోల్‌పై ఐరన్‌గ్రిల్ లేదు. దీని ఎదురుగా ఉన్న అడ్డరోడ్డులోని సైడ్ కాలువపై సిమెంట్ చప్టా రాయి కూడా కిందకు పడిపోయి ఉంది. దీంతో వీటిని గమనించకుండా రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు వాటిలో పడిపోయి గాయాల పాలవుతున్నారు. స్థానిక శానిటరీ సిబ్బందికి, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి వీటిని బాగుచేయించాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

డ్రెయినేజీ పైపులైను పగిలి రోడ్లపైకి నీరు..

స్థానిక 59వ డివిజన్‌లోని నార్త్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో సింగ్‌నగర్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఎదురుగా ఉన్న డ్రెయినేజీ ప్రధాన పైపులైను పగిలిపోయింది. దీంతో ఆ పైపులైను నుంచి మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తూ చెరువును తలపిస్తోంది. ఈ నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాస వస్తోంది. మురుగునీరు రోడ్లపైన చేరడంతో రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. పైపుల్లో నీటి ప్రవాహం తగ్గినపుడు ఈ మురుగునీరు మళ్లీ పైపుల్లో చేరుతోందని ప్రజలు అంటున్నారు. దీని వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు ఈ ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేయించి, మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన



మహా మండపం ఎదుట నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న టెక్నికల్ బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను టెక్నికల్ బృందం మంగళవారం పరిశీలించింది. ఇంద్రకీలాద్రిపై పూజా మందిరం, అన్నదాన భవనం, ప్రసాదాల పోటు, క్యూలైన్ కాంప్లెక్స్ పనులను చేపట్టింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న పూజా మండపాలు పనులు దాదాపు పూర్తి కావస్తుండగా, అన్నదానం, ప్రసాదాల పోటు భవనాలు కీలక దశకు చేరుకున్నాయి. దీంతో దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్రమోహన్, మాస్టర్ ప్లాన్ ప్రధాన సలహాదారు కొండలరావు, దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ శేఖర్, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను పరిశీలించిన టెక్నికల్ బృందం ఆలయ ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. హెడ్ వాటర్ వర్క్స్ ఎదుట రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణంపై టెక్నికల్ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసింది.

వీఎంసీ ఆధ్వర్యంలో వేసవి ఉచిత క్రీడా శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వేసవి ఉచిత క్రీడా శిక్షణ అందిస్తున్నామని, స్విమ్మింగ్‌పూల్స్, ఇండోర్ స్టేడియం, స్కేటింగ్ రింక్‌లలో శిక్షణ ఇస్తామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్విమ్మింగ్‌కు గాంధీనగర్‌లోని సర్‌విజ్జీ స్విమ్మింగ్‌పూల్, గురునానక్‌లోని స్విమ్మింగ్ పూల్, చిట్టినగర్‌లోని డాక్టర్ కేఎల్‌రావు స్విమ్మింగ్‌పూల్‌ల్లో శిక్షణ ఇస్తామన్నారు. బ్యాడ్మింటన్‌కు ఎంజీ రోడ్డులోని దండమూడి రాజగోపాలచారి ఇండోర్ స్టేడియం, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో, స్కేటింగ్‌కు దండమూడి రాజగోపాలాచారి ఇండోర్ స్టేడియంలో, సత్యనారాయణపురంలోని జీవీఎస్ శాస్త్రి పార్కులో, భవానీపురంలోని రోజ్ గార్డెన్ పార్కులో శిక్షణ ఇస్తామని తెలిపారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యోగాలో కూడా శిక్షణ అందిస్తారని, ఆయా క్రీడలు, ఆటల్లో శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులు ఎలాంటి ఫీజు లేకుండా ఆయా స్టేడియాల్లో, శిక్షణ ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంచుకున్న క్రీడలకు సంబంధించి దుస్తులు, క్రీడా పరికరాలు సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు.

బెంగళూరులో వీఎంసీ కార్పొరేటర్లు



బెంగళూరు కార్పొరేషన్‌లో వీఎంసీ కార్పొరేటర్లు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రలో మొదటి రోజు బెంగళూరులోని కే 100, వైట్ టాప్ రోడ్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. బృహత్ బెంగళూరు మహానగర పాలికే(గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్)లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేశారు. బీబీఎంసీలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విజయవాడ కార్పొరేటర్లకు ఆహ్వానం పలికిన బీబీఎంసీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సవాళ్లు, కార్పొరేషన్ స్థితిగతులను వివరించారు. బెంగళూరులో 225 చదరపు కిలోమీటర్లతో మొదలైన బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రస్తుతం 700 చదనపు కిలోమీటర్ల విస్తరణలో, కోటి నలభై ఒక లక్షల జనాభాతో, గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్‌గా 8 జోన్‌లతో అభివృద్ధి చెందిందని కమిషనర్ తుషార్ గిరినాథ్ తమకు వివరించారని వీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యనారాయణ తెలిపారు.

క్లైమేట్ యాక్షన్ ప్లాన్ నిర్వహణ..

25 నుంచి 30 ఏళ్ల వరకు ఎలాంటి నిర్వహణ ఖర్చు లేకుండా ఉండే వైట్ టాప్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారని, ప్రస్తుతం బెంగళూరు నగరంలో 200 కిలోమీటర్ల వరకు వైట్ టాప్ రోడ్లు వివిధ ప్రాంతాల్లో ఉన్నాయని డెప్యూటీ మేయర్ అవుతుశైలజ రెడ్డి పేర్కొన్నారు. నగరంలో మురుగునీటి పారుదలకు సంబంధించి కే 100 ప్రాజెక్టుని ప్రస్తుతం చేపడుతున్నట్లు చెప్పారన్నారు. కోరమంగళ వ్యాలీ నుంచే మొదలై 100 కిలోమీటర్ల వరకు ఉన్న ఈ ప్రాజెక్టుకు ఓ100 స్ట్రామ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్ట్ సంబంధిత ప్రాజెక్ట్ అన్నారు. కే 100 ప్రాజెక్టులో భాగంగా సహజ పద్ధతిలో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌లో కాలుష్యాన్ని కాలవలో పెరిగే మొక్కల ద్వారా తగ్గిస్తూ నీటి శుద్ధత చేస్తున్నారని చెప్పారు. కేవలం వర్షపు నీటి డ్రెయిన్ మాత్రమే కాకుండా పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అక్కడ అందిస్తున్నారన్నారు. భారతదేశంలోనే క్లైమేట్ యాక్షన్ ప్లాన్ నిర్వహించడంలో బెంగళూరు 3వ నగరమని చెప్పారు. అందులో భాగంగా పర్యావరణం, సరస్సులు, అభివృద్ధి పరుస్తున్నారని, గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్యంగా నాలుగు సవాళ్లు ఎదుర్కొంటుందన్నారు. అవి వ్యర్థాలు, రోడ్లు, లైటింగ్, సరస్సులని కమిషనర్ తమకు వివరించారని డెప్యూటీ మేయర్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి గాలి నాణ్యత సరస్సులలో నీటి సాంద్రత, వెహికల్ ట్రాకింగ్ వంటి అంశాలు నిర్వహిస్తారని చెప్పారు.

ఆరోగ్యకరమైన సమాజానికి పౌష్టికాహారం అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ ఎంవీ రాథోడ్

పాయకాపురం(విజయవాడరూరల్): పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని డాక్టర్ ఎంవీ రాథోడ్ అన్నారు. మంగళవారం రాజీవ్‌నగర్లో పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాథోడ్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం డెలివరీ తర్వాత వెయ్యి రోజుల వరకు తీసుకోవాలని సూచించారు. తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టైమ్ ప్రకారం పౌష్టికాహారం తీసుకొనేలా సిబ్బంది ఆసక్తి చూపాలన్నారు. ఎంఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని, ఆ తర్వాత ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్స్‌లో చేర్చాలని తల్లులకు సూచించారు. అనంతరం పౌష్టికాహారం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అర్బన్ అధికారి డి.జ్యోత్స్న, వి.నాగమణి, జి.ప్రశాంతి, వి.విజయ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, కళా రంగాలకు పెద్దపీట



దూపాటి శ్రీదేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సాహిత్య, సాంస్కృతిక కళారంగాలకు ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ పెద్దపీట వేస్తోందని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యంలో 2025 సంవత్సరంలో కూటమి ప్రభుత్వంలో ఉగాది, కళారత్న పురస్కారాలు అందుకున్న ఎక్స్‌రే సభ్యులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని మంగళవారం విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ బాధ్యుడు లక్ష్మయ్య, లయన్స్, వాకర్స్ క్లబ్ నాయకులు రావి కృష్ణారావు పాల్గొన్నారు. కళారత్న పురస్కార గ్రహీతలు దామోదర గణపతిరావు, మెండెపు ప్రసాద్, ఉగాది పురస్కారాల గ్రహీతలు బండ్లమాధవరావు, సరికొండ నరసింహరాజు, చలపాక ప్రకాష్‌చ కలిమిశ్రీ, అరసవిల్లి గిరిధర్, సింహాద్రి వాణి, దూపాటి శ్రీదేవిలను ఆత్మీయంగా సత్కరించారు. ఎక్స్‌రే సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కమిటీ సభ్యులు రవికిరణ్, సీహెచ్‌వీ సుబ్బయ్య నిర్వహించారు.

1,351 మంది విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



పాఠశాలలో కళ్లజోళ్లు స్వీకరించిన విద్యార్థులతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దృష్యం ఐకేర్ ప్రాజెక్ట్‌లో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యాన నగరంలోని 20 నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ వీ శ్రీదేవి అన్నారు. స్థానిక ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారా యణరాజు నగర పాలక సంస్థ పాఠశాలలో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ, సమగ్ర శిక్ష సహకారంతో విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.కండ్రిక, రాజీవ్‌నగర్, సూర్యారావు పేట, అరండల్‌పేట తదితర ప్రాంతాలలోని పాఠశాలలో విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము మాక్స్ విజన్ సహకారంతో 6,754 మంది విద్యార్థులను పరీక్షించగా అందులో 1,351 విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరాన్ని గుర్తించి అందజేస్తున్నామన్నారు. వారం రోజులుగా కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లు విక్రయిస్తామని డబ్బు తీసుకుని చేసిన మోసంపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో ఇ బ్లాక్ 239వ నంబరు ఇంటిని విక్రయించేందుకు డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయటం లేదని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వాంబే కాలనీలో ఇ బ్లాక్ 239వ నంబరు ఇంటిని విక్రయిస్తామని దోడ ఝాన్సీ, ఆమె భర్త ఆంథోని రాజు రూ.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం రెండు దఫాలుగా రూ.5,84,000 తీసుకొని ఇంటిని రిజిస్ట్రేషన్ చేయడం లేదని తెలంగాణ రాష్ట్రం సరూర్‌నగర్, కొత్తపేట సత్యంనగర్‌కు చెందిన వృక్యం కరుణ ఫిర్యాదు చేశారు. 2021 జూలై 7న రూ.3.50 లక్షలను, రిజిస్ట్రేషన్ నిమిత్తం హైదరాబాద్ వచ్చినపుడు ఫోన్‌పే ద్వారా మరో రూ.2 లక్షలు చెల్లించినట్టు తెలిపారు. అయినా 4 సంవత్సరాల నుంచి ఇల్లు రిజిస్ట్రేషన్ చేయకుండా, ఇల్లు అప్పగించకుండా దంపతులు ఇరువురూ తప్పించుకుని తిరుగుతున్నారని, చేసిన మోసంపై చర్య తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

99 మంది మందుబాబులకు జరిమానా

విజయవాడ లీగల్: నగరంలో వివిధ ప్రాంతాలలో మద్యం తాగి వాహనాలు నడిపిన 99 మందికి న్యాయమూర్తులు లెనిన్‌బాబు, ఆర్‌వీ శర్మ జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 1, 2, 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో 13 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, మరో 86 మందిలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేస్తామన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని నగర పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు సూచించారు.

రసాయన శాస్త్ర ప్రాముఖ్యత ఎనలేనిది

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సుస్థిరాభివృద్ధిలో రసాయన శాస్త్రం అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఎస్ఆర్ఆర్ పూర్వ విద్యార్థి ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని రసాయన శాస్త్రంలో ఉపాధి అవకాశాలు, రసాయన శాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. సుస్థిర అభివృద్ధిలో రసాయన శాస్త్రం ప్రాముఖ్యత ఎనలేనిదని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ శైలజ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథి డాక్టర్ సుబ్రహ్మణ్యంను సత్కరించారు. డాక్టర్ జే నాగేశ్వరరావు, మల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వాగ్గేయకారుల సంకీర్తనం

విజయవాడ కల్చరల్: కంచి కామకోటి పీఠస్థ శ్రీ వెంకటేశ్వర, శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కుంచనపల్లి గీతాంజలి పబ్లిక్ స్కూల్ బాల బాలికలు ఆలపించిన వాగ్గేయకారుల సంకీర్తనలు చిన్నారుల ప్రతిభకు అద్దంపట్టాయి. పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తనతోపాటు ఇతర రామదాసు రచించిన సంకీర్తనలు జ్ఞానానంద మయందేవం, గురుస్తుతి, మహాగణపతిం, పలుకే బంగారమాయన, మాధవా కేశవా మధుసూదనా, జగడపు జనువుల జాజర, నవనీత చోరా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. దేవాలయ కార్యక్రమ పర్యవేక్షుడు డాక్టర్ సీ రామ్మోనరావు మాట్లాడుతూ పద కవితకు ఆద్యుడు అన్నమయ్య అని అభివర్ణించారు. ఆయన సంకీర్తనలు తెలుగు తనం నిండివుంటాయన్నారు. దేవాలయ మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

●చెక్క సామగ్రికి కేరాఫ్ పూర్ణానందంపేట







విజయవాడ నగరంలో చెక్క సామగ్రికి కేరాఫ్ పూర్ణానందంపేటగా నిలుస్తోంది. చెక్కతో తయారు చేసిన మంచాలు, టేబుల్స్, కుర్చీలు, బల్లలు, పీటలు, చిన్న పిల్లలు నడక నేర్చుకోవడానికి అవసరమైన మూడు చక్రాల బండ్లు ఇక్కడ లభిస్తాయి. ప్రస్తుతం అన్ని వస్తువులు రెడీమెడ్‌గా అన్ని చోట్ల లభ్యం కావడంతో వ్యాపారాలు తగ్గాయని వడ్రంగులు వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం



యోగాసనం వేస్తున్న యోగా సాధకుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మనిషి జీవితంలో ఏదో ఒక రకంగా మానసిక ఒత్తిడికి గురవుతారని, దానిని అధిగమించేందుకు యోగా ఒక్కటే మార్గమని నగరపాలకసంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేసవి ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచే యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. శరీరానికి, మనసుకు మధ్య సమతుల్యానికి యోగా దోహదపడుతుందని, తద్వారా ఆరోగ్యకర జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. ప్రపంచ మానవాళికి మన దేశం ఇచ్చిన కానుక యోగా అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. అనారోగ్య సమస్యల పరిష్కారానికి సహజ సిద్ధమైన సులభ మార్గం యోగా విద్య అన్నారు. దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని సూచించారు. యోగా దినచర్యగా మారినప్పుడు ఔషధాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

వేల మందికి యోగా శిక్షణ..

అమరావతి యోగా, యేరోబిక్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీ రమణ మాట్లాడుతూ.. 2017 నుంచి ప్రతి ఏటా వేల మందికి ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. తొలుత మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర యోగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో కలిసి యోగాసనాలను వేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి, ఇన్‌స్పెక్టర్ దాసరి కాశీ విశ్వనాథ్, సీహెచ్ అరుణ్ కుమార్, అసోసియేషన్ కోశాధికారి ఏ.లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి.ప్రశాంత్‌కుమార్, కె.గాంధీ బాబు, విశ్రాంత డీసీపీ టి.హరికృష్ణ, అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, యోగా కోచ్ ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపజేయాలి



డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

పాయకాపురం(విజయవాడ రూరల్): ఏపీ వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తించేలా ప్రమోషన్లు కల్పించాలని ఏపీ వెడ్స్ జాయింట్ యాక్షన్ కమిటీ డైరెక్టర్ కె.శివప్రసాద్ రెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు ప్రభుత్వం గతంలో కల్పించిన ప్రమోషన్ ఛానల్‌లో సంక్రమించవలసిన వార్డు పరిపాలన కార్యదర్శి పోస్టులను ఎక్కువ శాతం మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ద్వారా నియమించడం జరిగింది. ఇలా చేయడం ద్వారా వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు చాలా మందికి ప్రమోషన్ రాలేదు. సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తించేలా ప్రమోషన్లు కల్పించే విషయాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ బి.గంటయ్య, కన్వీనర్ జి.యశ్వంత్, కో కన్వీనర్ పి.శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.